

'వాళ్ళది చాలా గౌరవమయిన కుటుంబం. పిల్ల చాలా అందంగా వుంటుంది. నువ్వే చూస్తావుగా' నాన్నగారు నన్ను రైలెక్కించి చెప్పారు. ఇది యిప్పటికి యెన్నోసారో చెప్పటం?

'శేషూ! ఆ పిల్ల మూగదిట! నీకు తెల్సి యెందుకు పెళ్ళిచూపులకి వెళ్తున్నావు? ఇందులో యెవరి బలవంతమన్నా వుందా?' నాన్నగారు వినకుండా నన్ను ప్రశ్నించాడు గోపాల్.

చిరునవ్వుతో 'లేదురా బలవంతం యేంలేదు' అన్నాను.

'ఐతే నువ్వు పూర్తిగా యిష్టపడుతున్నావా?'

'నేను యిష్టపడుతున్నానని చెప్పందే! పెళ్ళిచూపులకి వెళ్తున్నాను. నచ్చితే వొప్పుకుంటాను.'

'ఇలా చెయ్యటంవల్ల బహుశః ఆ అమ్మాయిని వుద్ధరిస్తున్నావనుకుంటున్నావా? ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుని యెలా హాయిగా జీవితం గడపగలవు?' గోపాల్ నా చెయ్యి నొక్కుతూ అడిగాడు.

'మనసుని అర్థం చేసుకుంటే హాయిగా జీవించగలం.' గోపాల్ చిన్ననాటి స్నేహితుడయినా గోపాల్ యీ విషయంలో నన్నర్థంచేసుకోలేకపోయాడు.

'మీ నాన్నకి నలభై వేలు కట్నం

వస్తుంది. ఇక అమ్మాయి యెలావుంటేనేం ఆయనకి? వచ్చిన మంచిసంబంధాలన్నీ వదులుకుని యీ సంబంధానికెలా యిష్టపడ్డావురా? నువ్వనుకుంటున్నది త్యాగంకాదు.' గోపాల్ హెచ్చరించాడు. ప్లాట్‌ఫాంమీద నిల్చుని నాన్న చుట్ట వెలిగించారు. రైలు కేకేసి కదిలింది నెమ్మదిగా.

'నీ మనస్తత్వంఅర్థంకావటంలేదురా శేషూ! నువ్వుకాపోతే ఆ మూగపిల్లకింకోడు దొరుకుతాడు. చూస్తూ చూస్తూ...నువ్వు...యెందుకు వప్పుకుంటున్నావు? నామాటవిను..పిల్ల నచ్చలేదని చెప్పేసేయకూడదు'... గోపాల్ యింకాయేదో హెచ్చరించబోయాడు. రైలు మెల్లిగా వేగాన్నందుకుంటూంది.

'గోపాల్ రావ్! దిగవోయ్' అంటూ ప్లాట్‌ఫాం మీంచి నాన్నగారు కేకేసారు. గోపాల్ స్నేహపూర్వకంగా అరచెయ్యి నొక్కి దిగిపోయాడు.

'ఒరేయ్ వాళ్ళది గౌరవమయిన కుటుంబం!' నాన్నగారి కేక రైలు కూతతో కల్సిపోయింది. రైలు స్టేషన్ దాటేసింది. నాన్నగారి హెచ్చరింపుకి నాకు నవ్వొచ్చింది. మా పొలాలు కనుమరుగవుతున్నాయి.

ఎవరిగొడవా యెవరికీ అక్కర్లేదు. నిద్రపోయేవాళ్ళు నిద్రపోతున్నారు. జోగేవాళ్ళు జోగుతున్నారు. సంధ్య చీకట్లో నీలందీపాలు నీరసంగా వెలుగుతున్నాయి. నాకు కూర్చుందుకు చోటు దొరికింది. రైల్లో కూర్చోటానిక్కూడా నోచుకోని వాళ్ళెందరో!

నా యెదురుగా ఓ యువకుడు కిటికీ దగ్గరకూర్చున్నాడు. అతని ప్రక్కనే భార్యా రత్నం కాబోలు, అతడి నానుకుని కూర్చుంది. కొత్తగా పెళ్ళయిన జంటలావుంది. రైలుకుదుపుకి అతడి దేహాన్ని తాకీతాకనట్లు తాకుతూందా యువతి. వాళ్ళకి యితర ప్రపంచం ధ్యాసే వున్నట్టులేదు. 'మా ఆయన' అన్నట్టున్నాయి ఆవిడ చూపులు. బహుశః యెంతకి కొనుంటుందో భర్తని? నా ఆలోచనలు పరిపరివిధాల సాగుతున్నాయి.

నేను బి. యస్సీ. పాసయ్యాను. మా నాన్న ఓ మోతుబరి. మాది పల్లెటూరు. నాకు యెన్ని ఆశలు ఆశయా లున్నా మా నాన్న కట్నందగ్గర పట్టువదిలే రకంకాదు. ఆయనకు పెళ్ళికన్న కట్నం ముఖ్యం. నేను పరీక్ష పాసవగానే సంబంధాలు రావటం మొదలెట్టాయి

ఫలానివారమ్మాయి బావుంటుందిట. పాతికవేలు కట్నం యిస్తారు....వీళ్లమ్మాయి సుమారుగా వుంటుందిట. ముప్పయివేలు కట్నం యివ్వగలరట. మొన్నెవరో పదిహేనువేలు యిస్తామంటూ వచ్చారు. మంచినీళ్లుకావాలా?

అనడిగాను. ఇలాసాగేవి నాన్నగారి మాటలు.

పెళ్ళిచూపులకి వెళ్ళటం, నాకు నచ్చలేదని మెల్లిగాజారుకోవటం నేను డిగ్రీపుచ్చుకున్నాక నేర్చుకున్నాను.

'డబ్బుంది పట్నం వెళ్ళి యేం చేస్తావ్? వ్యవసాయం చూసుకో.'

'నాన్నగారు సలహాయిచ్చారు. సరే అన్నాను. కట్నం పుచ్చుకోవటం అంటే నాకు మంట. కాని యేంచేస్తాం? మా నాన్న మొండిమనిషి.

మొన్నీమధ్య 'ఏరా? ప్రతిసారీ దాటేస్తున్నావ్?' నీ వుద్దేశ్యమేంటి? ప్రేమవ్యవహారాల్లో పడ్డావా?' అంటూ గదమాయించారు.

నాకిలాటి గదమాయింపులంటే అసహ్యం. అలాటిదేంలేదని మెల్లిగా చెప్పాను.

'మరయితే నీ వుద్దేశ్యం?'

నా ఆశయాలని అమ్మ మూలంగా తెలియచేసాను.

అంతావిని ఆశయాలు బాగానే వున్నాయి కానీ ప్రపంచంలో పరువుగా బ్రతకాలని లేదా వాడికి అన్నారట.

ఇది జరిగిన కొంతకాలానికి మా నాన్న పనిమీద యింకో పల్లెటూరు వెళ్ళారు. పని ముగించుకుని వచ్చాక 'శేషూ నీకు పెళ్ళిసంబంధం నిశ్చయించాను' అన్నారు. నేనేం మాట్లాడలేదు.

'అమ్మాయి చాలా బావుంటుంది. వాళ్లూ పేరుగల రైతులే, మనవాళ్ళే. నలభై వేలు కట్నం యిస్తారట.'

నా గుండెలు గుభేలు మన్నాయి. ఇంతింత డబ్బు వీళ్ళకెక్కడిదో అనుకున్నా భయంగా.

'ఇకపోతే అమ్మాయి మూగది. మూగదైతేనేం? చక్కనిచుక్క. ఇవాయింతకన్న దమ్మిడీ యెక్కువకట్నం రాదు. అసలు పెళ్లాం మూగదయితేనే మంచిది తెల్సా! ఇటు పుట్టింటికీ అటు మెట్టినింటికీ పేరు తెస్తుంది'...ఆతర్వాత నాన్నగారెంతో చెప్పారు. పెళ్ళికూతురు ఫోటో చూసాను. నిజంగా చాలా అందమయిందే. అమ్మ మనసులోనే నెత్తీ నోరూ బాదుకుంది.

కట్నం విషయంలో ముఖాముఖి నేనేం చెయ్యలేను. పోనీ మూగపిల్లని పెళ్లాడితే తనెంత సుఖపడుతుందో ఎంత సంతోషిస్తుందో. అవును యీ అమ్మాయిని పెళ్ళాడతా అనుకున్నా. కానీ, కట్నం పుచ్చుకుంటూంటే నా గొప్పదనం యేం వుంది?

గోపాలం 'ఓకేయ్ యిది త్యాగం కాదు' అంటున్నాడే. మూగపిల్లకి జీవితాన్ని ప్రసాదించటంవల్ల కలిగే సంతోషం వాడికేం తెల్సు! నాకు వాడి మాటల్లో నమ్మకంలేదు. నా పెళ్ళాన్ని పువ్వుల్లో పెట్టి...ఆతర్వాత ఆలోచించటానికి సిగ్గేసింది మా దాంప

త్యాన్ని చూసి అందరూ యీర్ష్య చెందాలి. ఒకరినొకరు అర్థం చేసోగ్కలిగితే సంసారం సుఖసారమవుతుందని నా వుద్దేశ్యం.

ఊహలోకాన్నుంచి తేరుకుని చుట్టూ చూశాను. చాలా చీకటిగా వుంది బయట. నా వుద్దేశ్యంతో నిమిత్తం లేకుండా నిద్రాదేవి జోలపాడింది. రైలుపెట్టె తాళం వేసింది.

కళ్లు తెరిచేసరికి బయటి చీకటి మాయమవుతూంది. మెల్లిగా వెలుగు రేఖలు ఆక్రమించుకుంటున్నాయి. చల్లగాలి రివ్వురివ్వుమంటూంది. నా చుట్టుప్రక్కల కొంత మార్పు జరిగింది. ఇదివరకటి జంటలేదు. ఆ ప్రదేశంలో ఓ ముసలాయన కూర్చున్నాడు. ఆయనలో మా నాన్న పోలికలు వున్నట్టున్నాయి. కిటికీదగ్గర కూర్చుని అంత ప్రొద్దులే చుట్ట కాల్చుకుంటున్నాడు.

"ఏవండోయ్... యిదిగో... వచ్చే స్టేషన్ యేంటండీ?" మెల్లిగా అడిగాను.

"రామయ్యపాలెంలే! మందే వూరు?" జవాబు చెప్పినట్టే చెప్పి ప్రశ్న వేశాడాయన.

"మందీ వూరేలెండి..." బ్రష్ తీస్కుని లేస్తూ చెప్పాను. రైలుబండి మెల్లిగా వూగుతూ వెళ్తూంది.

జవాబు అర్థంకాలే. "ఏం నాయనా?" అన్నాడు. నేనుండేగా అక్కడ! ముసలాయన గొణుక్కుంటూ చుట్టకాల్చటంలో మునిగిపోయాడు.

రామయ్యపాలెం! రైలాగింది కాబట్టి, యెదురుగా పేరు రాసుంది కాబట్టి రామయ్యపాలెం యిదే అన్పించి దిగాను. నాతో మరెవ్వరూ దిగలే. తూర్పు తెల్లవారింది. సూర్యుడు తొంగిచూస్తున్నాడు. రైలు సాగిపోయింది.

"మీరేనా శేషుగారు?" ఎవరో ప్రశ్నించారు.

"అవును!" అతనివంక చూసాను మాంచి ఆకర్షణీయంగా వున్నాడు. మెలితిరిగిన మీసాలు, తలకి తెల్లపాగా చుట్టుకున్నాడు. అతను ధరించినబట్టలు కొత్తవికాపోయినా మాయలేదు.

"నమస్కారం! నా పేరు శ్రీరాములు. బండి బయటుంది. రండి" అంటూ జవాబు కెదురు చూడకుండా దారితీశాడు సూట్‌కేసు అతను మోస్తాడని భావించి నిరాశపొందాను. సూట్‌కేసుతోసహా బండెక్కాను.

శ్రీరాములు బండిముందు కూర్చుని యెద్దులని అదిలించాడు. బండి కదిలి పోసాగింది.

"శ్యామలని పెళ్ళిచూపులు చూసేందుకు మీ రొక్కరే వచ్చారేం?" శ్రీరాములు అడిగాడు. ఏదో గొణుగుంటాను. జ్ఞాపకంలేదు.

"మీరు చదువుకున్న వారటగా"




శ్రీరాములు మళ్ళీ అడిగాడు. "ఏదో కొద్దిగా" అన్నాను.

"శ్యామలని పెళ్లాడితే మీ రదృష్ట వంతులు" యెవర్తోనో చెబుతున్నట్టున్నాడు శ్రీరాములు.

"ఏం" అన్నాను కుతూహలంగా.

"తన మనసు మంచిది. శ్యామల నెందుకు దేవుడు చిన్నచూపు చూశాడో తెలీకుండా వుంది. శ్యామలని మూగదానిగా చేసాడు పాపం!" శ్రీరాములు కంఠం మారినట్లు గ్రహించటానికెంతోసేపు పట్టలేదు.

చాలా కాలంనుంచీ వస్తేస్తున్న పాలేరయుంటాడు. శ్యామలంటే అభిమానంలా వుంది అనుకున్నాను. కాస్సేపు యిద్దరం మాట్లాడుకోలేదు. తర్వాత నేనే అడిగాను శ్యామలకి చదువొచ్చా అని.

"శ్యామల చక్కగారాస్తుందండీ!"

బండి తోలటంలో నిమగ్నుడయాడు శ్రీరాములు.

"ఇంకా వూరు రాలేదా ?" అడిగా నీ సారి.

"వచ్చేసామండీ ! అదిగో, ఆ కన పడేదే వూరు" అన్నాడు.

స్టేషన్ కి వూరికి అరగంట ప్రయాణం. మట్టి బాట కిరువైపులా దట్టంగా చెట్లున్నాయి. బండి వూళ్ళో ప్రవేశించింది. మహావుంటే నూటయాభై ఇళ్ళు దాకా వుంటాయి. ఊరు చక్కగా తీర్చిదిద్దినట్టుంది. చిన్న చెరువు, చెరువు ఒడ్డునే బిందెలతో పడుచులు, ఇళ్ళ ముందు ముగ్గులు. ఇవన్నీ ఆ పల్లెకు ప్రతిబింబాలు.

పల్లెపడుచులు నన్ను చూచి గుసగుస లాడుకోసాగారు. ఇతనే కాబోయే పెళ్ళికొడుకు అనుకునుంటారు. నాలో నూతన చైతన్యం కలిగింది. ఉత్సాహం వుంజుకుంది.

"అబ్బాయి గారేనా ? రైలీయేల బేగొచ్చిందేటి ?" యెవరో అడుగుతున్నారు.

"అవున్లెండి" శ్రీరాములు జవాబు చెప్పాడు.

"ఇదిగో, అల్లుడొచ్చాడేవ్ ! ఒరే రాములూ పెట్టె ఆ కొసాగదిలో పెట్టు" ... బహుశ శ్యామల తండ్రి కాబోలు అజమాయిషీ చేస్తున్నాడు.

రా నాయనా, రా, అంటూ ఆయన భార్యామణి చిరునవ్వుతో ... ఆహ్వానించింది. ఇదేంటి ? పెళ్ళిచూపులకివస్తే అల్లుడొచ్చినట్టు మాట్లాడతారేంటి ? బావుందనుకున్నాను. అంతా ధన మహిమ మరి. బహుశ మా నాన్న పెళ్ళి కుదిర్చేసుంటాడు.

అదీ తెల్సిపోయింది. బట్టలూ అవీ మార్చుకున్నాక పాత పేపరు తిరగేస్తూ ముందుగదిలో కూర్చున్నాను.

"మీ నాన్నగారు ముహూర్తం పెట్టించేస్తానన్నారు. నేనే యెందుకూ, అబ్బాయిని కూడా చూడనివ్వండి అన్నాను. మీ నాన్నగారు బహు దొడ్డ మనిషోయ్ !" ఇంకా ఆయనేదో చెప్పుకు పోతున్నారు. క్షమించాలి, ఆయనెవరో మీకు తెలీదుకదూ. ఆయనే శ్యామల తండ్రి.

నా కళ్ళు శ్యామలకోసం వెతుకుతున్నాయి. అట్టేసేపు వెతకనవసరం లేకుండానే తల్లితో శ్యామల సాక్షాత్కరించింది. అలంకరణ విషయంలో ఇంటిల్లిపాదీ శ్రద్ధవహించినట్టున్నారు. కానీ అలంకరణలు లేకుండానే శ్యామల చాలా అందంగా వుంటుందనిపించింది. "అలా కూర్చోఅమ్మా !" తండ్రి హెచ్చరించాడు. శ్యామల నా యెదురుగా కూర్చుంది తలొంచుకుని. నాకు బాగా జ్ఞాపకం. తను నన్నొకసారి చూసింది. ఆ చూపులు దీనంగా వున్నాయి.

శ్యామల పేరుకితగ్గ స్త్రీ. తనలో

సాక్షాత్ లక్ష్మీకళ వుట్టిపడుతూంది. ఒకసారి చూస్తే మళ్ళీమళ్ళీ చూడాలన్పించే ముఖారవిందం! ఓహ్, ఎలా వర్ణించటం? చెబితే కానీ తను మూగదని తెలీదు. పాపం! శ్యామల!

పనివాళ్ళెవరో రావటంవల్ల ఆ గదిలో మమ్మల్నిద్దర్నీ వదిలి శ్యామల తండ్రి బయటికి వెళ్ళారు. చుట్టు ప్రక్కల యెవరూ లేరు! అమాయకమయిన తన ముఖంలోకి చూస్తూ తన్మయుడినై పోతానేమోఅన్పించింది.

నీ పేరు శ్యామలకదూ ... ఎందుకడిగానో నాకే అర్థంకాలేదు.

శ్యామల వొక్కసారి తలెత్తి మళ్ళీ దించుకుంది. ఆమె విశాల నయనాల నుండి టపటపా నీటిచుక్కలు జారుతున్నాయి. "ఛీ! ఎందుకడిగానా" అన్పించింది.

"నాకీ పేరు చాలా యిష్టం. చాలా చక్కటి పేరు" అన్నాను అనునయంగా. నాన్నగారికి యీ అమ్మాయిని చూచినా కట్నం తీసోక్కవాలన్పించటం ఆశ్చర్యంగా వుంది.

తలెత్తకుండానే శ్యామల ఓరగా చూసింది. ఆ చూపులలో కృతజ్ఞత వుంది.

నాకింకేం మాట్లాడాలన్పించలేదు. తన సజల నయనాలని నాజేబుగుడ్డతో అద్దాలని, ఆమెతల నిమురుతూ, నీకేం భయంలేదు, నిన్నంతా అపురూపంగా చూసుకుంటారనీ చెప్పాలన్పించింది. నాలో ఏదో ఆవేశం కలిగింది. గబుక్కున లేచాను. మెల్లగా శ్యామలా, ఛ, తప్పుకాదూ? యేడవ్వొచ్చా అంటూ జేబురుమాలుతో కళ్ళద్దబోయాను. శ్యామల తడబాటుతో లోపలికి వెళ్ళిపోయింది.

నేనలా ప్రవర్తించటానికి కెలా సాహసించానో నాకే అర్థంకాలేదు. అలాంటి సంఘటనలనే మన పెద్దలు దైవీకం అంటారు.

*　　*　　*

భోజనం అయాక నాకిచ్చిన గదిలోకి వెళ్ళి పడుకున్నాను. నాకక్కడ జరుగుతున్న సత్కారాలు చూచి ఆశ్చర్యపోవటమే నావంతు. జీవితంలో రెండో భాగాన్ని చూడబోతున్నాననే సంతోషం నాలో యేమూలో కలిగింది. లంకంత యిల్లున్నా మనుషులు తక్కువే ఆయింట్లో.

మెళుకువ వచ్చేసరికి నల్లపరికిణీ, నల్లవోణీ వేసుకుని, తెల్లజాకెట్టు తొడుక్కున్నఓ పడుచుగదితుడుస్తూంది. బహుశః పనిపిల్ల అయుంటుందనుకున్నా. ధరించిన దుస్తులు అక్కడక్కడ చినిగినా కుట్టుకున్న గుర్తులు కన్పిస్తున్నవి.

"ముఖం కడుక్కుందుకు నీళ్ళు సిద్ధంగా వున్నాయండీ" అందామె నన్నుచూసి చీపురు కిందకి జారుస్తూ. పనిపిల్ల యింత శుభ్రంగా తెలుగు

మాట్లాడటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. మరయితే పొద్దున్న ఈఅమ్మాయిని చూడలేదేం చెప్మా! అనుకున్నా. అయినా అందరినీ చూడాలని రాసుందేమిటి? టవల్ తీసుకుని ఆ అమ్మాయి వెనుకనడిచాను.

ఏం అల్లుడూ! అప్పుడే లేచారేం? అంటూ యెదురయ్యాడు శ్యామల తండ్రి. "ఎప్పుడూ మధ్యాహ్నం పడుకునే అలవాటులేదండీ!" నేనేం జవాబు చెబుతున్నానో నాకేతెలీదు మరి.

"ఆహా! ఐతే ఫరవాలేదు. మా అమ్మాయితో కబుర్లు చెప్తావన్నమాట. తనకి బాగా కాలక్షేపం అవుతుంది" నవ్వారాయన.

"శారదా! బాబుగారు కాఫీ తాగాక మనపొలం చూపించమని శ్రీరాములుతో చెప్పు" అన్నారాయన. నల్లపరికిణీ అమ్మాయి తలూపింది. ఆ అమ్మాయిపేరు శారదన్నమాట! నాకిష్టమయిన పేర్లలో యిదొకటి.

*    *    *


రండి, పోదాం. చీకటవుతుంది. ఆలస్యం అయితే యిక్కడ పాము లెక్కువ అంటూ శ్రీరాములు యింటిదారి పట్టాడు. మనుషులకన్న పాములేం భయంకరమైనవి కావులే అనుకున్నా మనసులో. శ్రీరాములు యేం మాట్లాడినా, యెంతసేపు మాట్లాడినా పొలాలగురించి, వాళ్ళ నల్లెగురించే మాట్లాడేవాడు. మాట్లాడుతున్నంతసేపూ తను యేదోబాధనిఅనుభవిస్తున్నట్టుండేవాడు.అసలామాటకొస్తే మాయిద్దరిమధ్యా అట్టే సంభాషణ జరగలేదుకూడా.

ఇల్లు చేరుతోంటే నేనోమాట అనకండా వుండలేకపోయాను. "శ్రీరాములూ, నువ్వు నాకు చాలా నచ్చావోయ్!"

శ్రీరాములు నన్ను విచిత్రంగా చూసాడు. 'నిజం! నువ్వు చాలా మితభాషివి' అన్నాను. ఆమాట తన కర్థం అయిందోలేదో నాకు తెలీదు. బహుశః అర్థం అయుంటుందనుకుంటా.

రాత్రి భోజనాల సమయంలో శారద శ్యామల తల్లికి సాయంచేసింది. నా యెదురుగా శ్యామలకూడా కూర్చుంది. తను బహుశః సిగ్గువల్ల కాబోలు సరిగ్గా భోంచెయ్యలేకపోయింది. శారదమాత్రం అప్పుడప్పుడు మరీ ఆడాళ్ళలా అలా సిగ్గుపడతారేంటండీ? అని నన్నుమృదువుగా హెచ్చరించేది. శ్యామలతండ్రి అప్పుడప్పుడు శారదవంక గుర్రుగా చూసేవాడు. శారద అతడిని లక్ష్యపెట్టినట్టు లేదు. అవును మరి. పనిమనిషి చొరవగా మాట్లాడుత్తూంటే సహించటానికి ఆయనేం అమెరికన్ కాదుగా.

అందరికన్న ముందు శ్యామల భోజనం ముగించి వెళ్ళిపోయింది. ఆమె




ముఖంలో భావాలు పసికట్టడం నా తరం కాలేదు.

నేను తక్కువగా మాట్లాడి నా శ్యామలతండ్రి చాలాసేపు వాగాడు. ఆ తర్వాత అతనికి నిద్దరొచ్చుంటుంది "అలసటగా వుందేమో నీ గదిలో పక్కా అదీ వేయించాను. వెళ్ళి పడుకోవోయ్ మరి" అంటూ లేచాడాయన.

బ్రతికానురా బాబూ అనుకున్నా. అసలు పడుకోబోయేముందు శ్యామలనోసారి చూడాలనిపించింది. కానీ సాధ్యపడలేదు. రాత్రి చాలా పొద్దుపోయింది. ముసలాయన "పశువులకి గడ్డివేసావా?" అని అరుస్తున్నాడు. బయటినుండి శ్రీరాములు "వేసానండీ" అని జవాబిచ్చినట్టున్నాడు.

గది కిటికీలోంచి తొంగి చూసాను. దూరంగా పశువుల పాక దగ్గరున్న ఓ గదిలో గుడ్డిదీపం వెలుగులో శారద శ్రీరాములికి వడ్డిస్తూంది. శ్రీరాములేదో అంటున్నాడు. శారద చీర కొంగుతో కళ్ళు తుడుచుకోవటం కన్పించింది.

* * *

నాకు తరచు కలలు వస్తూంటాయి. ఆ రాత్రి నాకో తమాషా కలొచ్చింది. నేనెవరితోనో మాట్లాడుతున్నాను. కాదు- వాదిస్తున్నాను. నేనేం వాదిస్తున్నానో యెవరితో వాదిస్తున్నానో నాకే తెలీదు - ఎడమచేతిని నిటారుగా పెట్టి బొటనవ్రేలిని కదిలిస్తూ వాదిస్తున్నాను.

మెల్లిగా నా మణికట్టుని యెవరో పట్టుకున్నారు. చల్లని స్పర్శ అది! హృదయాలని స్పందింపజేసే మనోహరమయిన మధురానుభూతి!

ఒక్కసారి పక్కకి చూసాను. ఎవరో? ఓ అమ్మాయి ధైర్యంగా నా నాచెయ్యి పట్టుకని దీనంగా నా కళ్ళలోకి చూస్తున్నది. చెయ్యి వెనక్కులాక్కోబోయాను. ఆ అమ్మాయి మరింతగిట్టిగా పట్టుకుంది. తృప్తిగా, ఆనందంగా నిట్టూర్చాను. మళ్ళీ హస్తాన్ని హస్తంనుంచి విడిపించుకుందుకు ప్రయత్నించలేదు. కలకరిగిపోయింది.

నాకప్పుడెందువల్ల నిద్రాభంగం అయిందో తెలీదుకానీ మొత్తంమీద మెళకువ వచ్చింది. నాయెదుట మసక చీకట్లో కన్పించినదృశ్యం నన్నేం ఆలోచించ నియ్యలేదు. ఒక్కసారి యిది కలా నిజమా అన్పించింది. నేను ఆశ్చర్యంలోంచి తేరుకొనేలోగా ఆ దృశ్యం అదృశ్యం అయింది.


అసలు జరిగిందేమంటే కళ్లు తెరిచేప్పటికి కిటికీలోంచి మసగ్గా వెన్నెల గదిలో పడుతూంది. నాపాదాలవద్ద వొక స్త్రీమూర్తి! ఆమె హఠాత్తుగా వంగి నాపాదాలని తాకీ తాకనట్లు తాకి కళ్ళకద్దుకుంది. వెంటనే వెళ్ళిపోయింది!

ఏమిటీ విచిత్ర సంఘటన? నాకేం బోధపడలేదు. కానీ ఒకటిమాత్రం రూఢిగా చెప్పగలను. ఆ వచ్చింది మరెవ్వరోకాదు. శారద! నాకు నమస్కరించే అవసరం తనకేంవచ్చింది? అదీ యింత రాత్రిపూటా? శారద ఆయింట్లో పనిచెయ్యటంలేదా? కథల్లోలాగ శ్యామల తల్లిదండ్రులు లామెను రాచి రంపాన పెట్టటంలేదు కదా? ఈప్రశ్నలకి జవాబు చెప్పటానికి శారదక్కడుంటేగా!

అయితే వొకటి మాత్రం నిజం. శారద చర్యలవల్ల తను నన్ను ప్రేమిస్తున్నదని అర్థం అవుతూంది. ఐతే నేను చదివినట్టు Love at first sight అన్నది సంభవమన్నమాట! ఓహ్ విద్యార్థిలోకానికీ నిజమయిన లోకానికీ యెంత తేడా వుందో అప్పుడే అర్థమయింది.

ఈ సంఘటన గురించే ఆలోచిస్తూంటే మరో విచిత్రం జరిగింది.

సాధ్యమయినంత నెమ్మదిగా శ్యామల అక్కడికి వచ్చింది. నేను



కదుల్దామనుకున్నాను. కానీ నిశ్చలంగా వుండిపోయాను. చంద్రుడు మబ్బులచాటుకి వెళ్ళిపోయాడు. వెధవ కీచురాయొకటి కిటికీ దగ్గరనుండి అరుస్తున్నది.

శ్యామల నా దిండువగ్గర తెల్ల కవర్ పెట్టి వెళ్ళిపోయింది. శ్యామల నాకేదో ఉత్తరం తెచ్చింది! తను వెళ్ళిపోగానే లేచి కూర్చున్నాను. తనకీ పెళ్ళియిష్టంలేదా?తనుకానీ ఆత్మహత్య చేసుకుంటుందా! పెళ్ళిమానేమో కానీ తను ఆత్మహత్య చేసుకుంటుందని నే ననుకోను.

ఆలోచిస్తూ కూర్చుందుకు సమయం కాదిది. ఏదయినా చెయ్యాలి. ఏం చెయ్యాలి? ముందు ఉత్తరం చదవా లనిపించింది. గోడవారనున్న నూనె దీపం వెలిగించి వెలుతురు యెక్కువ కాకుండా జాగ్రత్తపడ్డాను. సన్నని గుడ్డిదీపం వెలుగులో ఆ వుత్తరం విప్పాను. ఎవరయినా వస్తారేమో అన్న భయం నాలో ఏదోమూలవున్నా భయాలని తొలగదోసాను.

శ్యామల చాలా సూటిగా ఉత్తరం ప్రారంభించింది.

శేషుమూర్తిగారికి

ఇలా ఓ కన్య మీకు ఉత్తరం వ్రాస్తూందని ఆశ్చర్యపడకండి. మీరు చదువుకున్నవారని విన్న నేను మీకు సంస్కారంకూడా అబ్బి వుంటుందను

కున్నాను. కానీ మీరూ పెద్దవారిలా అసభ్యంగా ప్రవర్తిస్తారనుకోలేదు.

మీలాగే నాకూ మనసుంది. నా యిష్టాయిష్టాలతో మీకు సంబంధం లేదా? మూగదాన్నయినా నాకూ భావాలున్నాయి. మూగపిల్ల ప్రేమించ కూడదా? ప్రేమిస్తేతప్పా? కాదను కుంటాను.

పెద్దవాళ్ళు మూగపిల్లని వదిలించు కుందామని తాపత్రయపడుతున్నారు. నాకీ పెళ్ళి యిష్టంలేదు. నేను పెద్ద వారి కిష్టంలేని వ్యక్తిని ప్రేమిస్తు న్నాను. బహుశా శ్రీరాముల్ని చూసే వుంటారు. ఆశ్చర్యంగావుందా? నా ప్రేమని యీ యింట్లో ఎవరూ అర్థం చేసుకోలేదు. కానీ శ్రీరాములు అర్థం చేసుకున్నాడు. అర్థం చేసుకుని ప్రయో జనం? మాటలురాక నేను మూగదాన్ని డబ్బులేక ఆయన మూగవారు! విధి మా యిద్దరినీ మూగజీవులుగా మార్చింది.

నా చిన్నప్పుడు శ్రీరాములు ఆయన చెల్లెలు మా యింట అనాథ లుగా ప్రవేశించారు. మా యింట్లో వారు పడేపాట్లు మీరు గమనించారను కుంటాను.

నాకు జ్ఞానం వచ్చినప్పటినుండి ఆయన్ని నేను ప్రేమించాను. భర్తగా భావించి ఆరాధించాను. నా మూగ భాషను అర్థంచేసుకున్న వ్యక్తి ఆయ నొక్కరే!

నేను మిమ్మల్ని ఒకోరిక కోరు తున్నాను. నామానాన నన్ను వదలి వెళ్ళిపోండి. నాకన్న మంచిస్త్రీ మీకు భార్యగా దొరుకుతుంది. నాబాధ అర్థం చేసుకుందుకు ప్రయత్నించండి. పిల్ల నచ్చలేదని మీపెద్దలతో చెప్పండి. ఈఒక్క సహాయం యీ నిర్భాగ్యపు మూగదానికి మీరు చెయ్యలేరా? లేదు. తప్పక చేస్తారనే ఆశలుపెంచు కున్నాను.

మీమనసు యిప్పటికీ మారకపోతే, యిదుగో వినండి. ఒక మూగపిల్ల చదుకున్న వ్యక్తిని నలభై వేలకి కొంటున్నదంటే మీకు అవమానంగా లేదూ? మీరు నన్ను పెళ్ళిచేసుకుంటే మీకు నా నలభై వేలే దక్కుతాయి. చదువుకితగ్గ సంస్కారం మీలోవుందని ఋజువు చేసుకోండి. దయచేసి యీ మూగమనసుతో చెలగాటాలాడద్దు.

జీవితంలో దేనికీ నోచుకోని

నిర్భాగ్యురాలు.

ఉత్తరం చదివి నిశ్చేష్టుడినయి పోయాను. "శ్యామలా! నీలో యిన్ని భావాలున్నాయా? నేను నిన్ను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాను. నన్ను క్షమించు" మనసులోనే బాధపడ్డాను. ఉత్తరం చదివాక తొలిసారిగా నాగొంతు జీరపోయింది.

శ్యామల నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదు. సృష్టి నలభై వేలకి పెద్ద కుక్కల్లాగ ఆశపడుతున్నా ననుకుంది. ఛీ పాడుమనుషులు, పాడుకట్నం. పాడుడబ్బు మనుషులచేత మనసులనే నాశనం చేయిస్తుంది.

నాకింక అక్కడుండాలన్పించలేదు. శ్యామల జీవితంలో నేను అడ్డు రాకూడదు. ఇదే నానిశ్చయం. ఉన్న ఒక్క సూట్ కేసూ తీసుకున్నాను. దాన్లో రెండువేల రూపాయలున్నాయి. అందుకే అది బరువుగావుంది. క్షణంలో ఆభయంకర వాతావరణంనుండి బయట పడ్డాను. అంతా వొళ్ళుమరిచి నిద్ర పోతున్నారు. వీళ్ళూ నేనూ యెప్పుడో వొకప్పుడు నిద్ర పోయేవాళ్ళమే!

. అడుగు ముందుకి పడుతున్నా మనసు వెనుకకి జారుతున్నది. ఒక్క సారి, వెళ్ళేముందు శ్రీరాములికిదంతా చెప్పి, ధైర్యవచనాలు పలికి వెళ్ళా లన్పించింది.

పశువుల శాల వైపు నడిచాను. పశువులశాల పక్కగదిలో దీపం వెలిగీ వెలగనట్టు వెలుగుతున్నది. పశువులు నన్ను వింతగా చూస్తున్నాయి. రోడ్డు మీద గ్రామసింహాలు గర్జిస్తున్నాయి.

తలుపుమీద చెయ్యి వేశాను. లోపలినుండి ఎక్కిళ్ళు వినిపిస్తున్నాయి. కంతలోంచి చూశాను. శ్రీరాములు భుజానికి తలానించి శ్యామల యేడుస్తున్నది. ఎదురుగా శారద దిగులుగా నిల్చునివుంది. అంతకుముందే యేడ్చిందేమో మరి!

శ్రీరాములు శ్యామలని వోదారుస్తున్నాడు. "శ్యామూ-ఛ, ఏడవకు. తప్పు శ్యామూ. నా మాట వినవూ. నన్ను పెళ్ళిచేసుకుని నువ్వేం సుఖపడతావు? మీ నాన్నగారు వొప్పుకోరు శ్యామలా! అన్నివిధాలా శేషుగారు నీకు తగినవారు.. అతనిది మంచి మనసని గ్రహించాను. నువ్వు సుఖపడతావు శ్యామలా!" శ్రీరాములు శ్యామల కళ్ళు తుడుస్తున్నాడు.

శ్యామల ఏవో మూగసౌంజ్ఞలు చేసింది. శ్యామలా...వద్దు వద్దు. అంత పని చెయ్యకు. నువ్వు చచ్చిపోకూడదు శ్యామలా! నిన్ను చావనివ్వను. శ్రీరాములు భయంగా తగ్గుస్థాయిలో వోదారుస్తున్నాడు.

శ్యామల ఆత్మహత్యచేసుకుంటానని సౌంజ్ఞ చేసుంటుంది. ఎంతయినా శ్యామల భారతస్త్రీ! అందునా ఆంధ్రవనిత! గర్వించాను. ఇదీ ... ఇదీ ప్రేమంటే! శెభాష్! ఇలాంటి గంభీరమయిన పరిస్థితిలో నాకు ఆనందంతో కన్నీరు జలజలాకారింది.

మెల్లిగా తలుపుతోసాను. తెరుచుకుంది. లోనికి ప్రవేశించి తలుపు దగ్గరికి వేసాను. శారద బిత్తరపోయింది. శ్రీరాములు చటుక్కున శ్యామల

నొదిలేసి నా వంక భయంగాచూసాడు. "బాబూ" అన్న రెండుపదాలు అతని నోటినుండి వెలువడ్డాయి. శ్యామల అతని యెడమచేతిని పట్టుకుని జాలిగా మా ఇద్దరినీ చూస్తూంది. ఆమె ముఖం దిగులుతో వాడిపోయింది. కన్నీటికి అంతూపొంతూ లేదేమో! భగవంతుడు అందరికీ ఇచ్చిన మహాప్రసాదం కన్నీళ్ళు. పోనీ అవన్నా సమృద్ధిగా ప్రసాదించాడు.

"బాబూ, నేనెంతో చెప్పానండీ శ్యామలకి. తను నా మాట వినటం లేదు. మీరు శ్యామలని తప్పక సుఖ పెడతారు. నాలాంటి దౌర్భాగ్యుడిని చేసుకుంటే శ్యామలకి కష్టాలే మిగుల్తా యండీ. మీరయినా చెప్పండి శ్యామ లకి." ఈ మాటలంటున్న శ్రీరాములు గొప్ప త్యాగం చేస్తున్నాడనిపించింది. శ్యామల దుఃఖంతో శ్రీరాములు చేతిని మరింత గట్టిగా పట్టుకుంది. శారద ఏం చెప్పలేని పరిస్థితిలో పెదవులు బిగించి కొంగును అడ్డుపెట్టుకుంది.

రైలెక్కిస్తూ గోపాల్ అన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి "శేషూ! నువ్వు చేస్తాననుకుంటున్నది త్యాగం కాదు."

అవును. త్యాగంఅన్న పదంమాత్రమే నాకు తెల్సు. దానికి నిజమయిన అర్థం శ్రీరాములికి మాత్రం తెల్సు.

సూట్‌కేస్ క్రిందపెట్టి ఒక్కో అడుగే ముందుకు వేస్తున్నా. హృదయంలో అగ్నిగోళాలు పేలిపోతున్నా దుమ్ము రేగిపోతున్నా నిశ్చలంగా నిల్చున్నాడు శ్రీరాములు.

మెల్లగా భుజంమీద చెయ్యివేసాను. "శ్రీరాములూ! శ్యామలకి తగిన భర్తవి నువ్వే!" శ్యామల ఈ అనుకోని సంఘటనకి ఆశ్చర్యపోయింది.

"నీకు శ్యామలంటే యింత ప్రేమ వున్నా యెందుకిలా తప్పుచేసినవాడిలా భయపడతావు? నీకు తనంటే నిజమైన ప్రేమలేదూ?చెప్పు శ్రీరాములూ..." సాధ్యమైనంత తగ్గుస్థాయిలో అరిచాను. అతను ఏం జవాబు చెప్పలేదు.

శ్యామలవైపు తిరిగాను."శ్యామలా నువ్వయినా చెప్పు, శ్రీరాములంటే నీకు అంతులేని ప్రేమకదూ, అతనికీ నువ్వంటే చాలా యిష్టంకదూ..., చెప్పు శ్యామలా! నీ మూగభాషని కొంతయినా అర్థం చేసుకోగలను."

శ్యామల నా మాటలకి అవునని తలాడించింది.

"చూసావా! ఈ ప్రేమనా నువ్వు త్యాగం చెయ్యాలనుకుంటున్నావు! 'నో' నే నొప్పుకోను. శ్యామలకి నువ్వే భర్తవి. మీ ఇద్దరి పెళ్ళి దగ్గరుండి జరిపిస్తాను. ష్యూర్......శ్రీరాములూ, మనం యువకులం. మనలో యువ రక్తంప్రవహిస్తూంది. మనం ఈ ముసలి సంఘానికి ఎందుకు భయపడాలి?" శ్రీరాములు భుజం పట్టుకు కుదిపేస్తు



న్నాను. నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది.

మనిషి సృష్టించిన డబ్బు మనిషినే బానిసగా చేసుకుంటున్నది. డబ్బుకా మనం బానిసలవాలి? మనం స్వతంత్ర జీవులం.

ఆవేశంలో శ్యామల కళ్లు తుడిచాను. శ్యామల ఇదివరకులా భయపడలేదు. పారిపోలేదు. శ్రీరాములు కంట నీటిపొర గిర్రున తిరిగింది.

"పదండి. అందరం వెళ్ళిపోదాం. నాకు ఇంతోఅంతో చదువు అబ్బింది. మన కాళ్ళమీద మనం బ్రతుకలేక పోము. మనం పట్నంపోదాం పదండి" తొందర పెడ్తున్నాను నేను.

శ్రీరాములేదో చెప్పబోయాడు.

"సందేహించకోయ్. అభిమానం వుంటే నీ పెళ్ళికి మన పెద్దలు పట్నం వచ్చి దీవిస్తారు, లేకపోతే దేవుడి దీవెనలు మన కెప్పుడూ వున్నాయి."

చాలా ఆవేశంగా అన్నాను.

శ్రీరాములు చేతులు జోడించ బోయాడు.

తప్పుతప్పు అంటూ భుజం తట్టాను. కొయ్యకి తగిలించిన తెల్లకండువా భుజాన వేసుకున్నాడతను. ఇప్పుడతని ముఖాన ఆనందం తాండవిస్తూంది.

శ్యామల ఏదో చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక మౌనంగా నా చేతులు పట్టుకుని కన్నీరు చిందిస్తున్నది.

రుమాలుతో కళ్లు తుడిచాను. "పిచ్చి పిల్లా? ఇవి దుఃఖాశ్రువులు కావుకదూ. ఆనంద బాష్పాలుకదూ! అవును" అన్నాను. శ్యామల తొలిసారిగా నవ్వింది. చటుక్కున వంగి పాదాలకు నమస్కరించింది. ఛ! ఛ! నాకాదు. అతనికి ... అంటూ గోడమీద వెంక టేశ్వరస్వామి పటం చూపించాను. శ్యామల చేతులు జోడించింది.

ముందు శ్రీరాములు వెనుక శ్యామల వీరి తర్వాత సూట్‌కేస్‌తో నేనూ నడుస్తున్నాం. మేం గుమ్మందాటేలోగా మాలో యెవరో తక్కువయా రన్పించింది. అవును మాలో శారద లేదు. వెంటనే వెనుతిరిగాను. శారద స్తంభా న్నానుకుని కంటివెంట బాష్పధారలు కురిపిస్తున్నది.

దగ్గరికి వెళ్ళి, ప్రేమగా తలనిమిరి, "పిచ్చి శారదా! నిన్ను మర్చిపోగలనా?" అన్నాను. శారద నా భుజం మీద తలవాల్చింది. చటుక్కున పాదాభివందనం చెయ్యబోయింది, వారించాను. "ఎన్నిసార్లు దండం పెడతావు? ముందే నే పడుకునుండగా పెట్టేసావుగా. భర్త మీది యీ అనురాగం, గౌరవం కల కాలం వుండనీ" అన్నాను.

శారద కృతజ్ఞతతో చూసింది. కళ్ళలో నీరు తళుక్కుమంది. చూపుడు వేలుతో కన్నీరు తుడిచాను. "ఛ యేడుస్తున్నావా శారదా?"

"కాదండీ ఇవి ఆనందబాష్పాలు!" నలుగురం బయటికి నడిచాం. కొద్దిసేపట్లో చీకటి మాయమవుతుంది. తూర్పు తెల్లవారుతుంది. మేం వెలుగులోకి ప్రయాణం చేస్తాం. చీకటి కోణాలిక మమ్మల్ని బాధించవు.

రామయ్యపాలెం ప్రజలు మేల్కొనేలోగా రైలు మరో నల్గురిని ఎక్కించుకుని ఆనందంగా యీలవేస్తూ సాగిపోయింది.